ప్రేమకు అర్థం
పెళ్ళి కాదన్న
అతనికి
ఎదురైన పరిస్థితి?

ఎస్.భవాని
కథ

# ఆరాధన

"ఏయ్. జాగ్రత్త! నొప్పి" ఆమె తన కాలును భయంగా పట్టుకుంది. అతను పకపకా నవ్వాడు. చేతిలోని వెండి కాలిపట్టాలను పక్క టేబుల్ మీద పెట్టి ఆమె పాదాలను, వేలమీద కూర్చుని చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా నిమురుతూ.

"ఏల కాలు నొచ్చె బాలామణికి? రాత్రి ఎవని స్వప్నసీమలకేగి వచ్చె?"

చిలిపిగా ఆమె అరిపాదంలో గిలిగింతలు పెట్టాడు. ఆమె కిలకిలా నవ్వుతూ,

"రాత్రంతా డాన్స్ ప్రాక్టీస్ చేసిచేసి కాళ్ళు మడమలు నెప్పిగా వున్నాయి. అది సరే కానీ! ఈ కాలిపట్టాల బదులు "మెట్టెలు" చేయించుకువస్తే ఇంకా సంతోషించేదాన్ని కదా!" నవ్వుతూ అంది.

అంతే! అతను చటుక్కున లేచి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. కారు స్పీడుగా గేటు లోపలకు తీసుకువచ్చి ఆపేసాడు. గబగబా నడుచుకుంటూ తన గదిలోకి వెళ్ళి ఫాన్ స్విచ్ వేసి మంచంపై అడ్డంగా పడుకుని ఆలోచించడం మొదలుపెట్టాడు.

భార్గవి... తన మదికోరిన మృదుమధుసీమ. ఎర్రగా, గుండ్రటి ముఖంతో మీడియమ్ హైట్‌తో ఎప్పుడూ నవ్వుతూ వుండే భార్గవి అంటే క్లాసులో అందరమ్మలకంటే తను చాలా ఇష్టం.

బెంచి వెనక కూర్చుని ఆమె అందంమీద వ్రాసిన కవితలు ఆమెకే వినిపించేలా గుసగుసగా చదువుతుంటే అవి అర్థం చేసుకుని భార్గవి ముఖంలో పులుముకునే ఎరుపులను టిక్... టిక్‌మని తన మనసు తీసిన ఫొటోలు ఇప్పటికీ తన హృదయంలో




భద్రంగా వున్నాయి. ఎంత 'ఆరాధన' ఆ అమ్మాయంటే...కలల జలతారు పరదాల మధ్య మౌనాల మేనాలో వయ్యారంగా నడుచుకుంటూ వచ్చే ఆమె కోసం 'చివరి బెంచీ'లో కూర్చుని యుగాల తరబడి అయినా నిరీక్షించాలన్పించేది.

ఆమె క్లాసులో అడుగుపెడ్తూ తనవేపు చూసి "అబ్బ! వున్నావా?" అన్నట్లు

రిలీఫ్‌గా చూపులు తన హృదయతంత్రిపై ఎన్ని రాగాలు మీటుతున్నాయో ఆమెకేం తెలుసు.

క్లాసులో పాఠం చెప్తున్నంతసేపు ఆమె ఏం చేస్తున్నదీ గమనిస్తూ, తనవేపు ఒక్కసారైనా చూస్తే బావుండునన్న ఆశతో ప్రతి పది సెకన్లకొకసారి ఆమె సైడ్ ఫోజును తినేస్తూ చూసేవాడు.

ఆమె తిరిగి చూడకపోతే లెక్చరర్‌మీద ఏదో జోక్ పేల్చి అందర్నీ నవ్విస్తే ఆమెకూడా వెనక్కి తిరిగి నవ్వుతూ చూసినపుడు తన మనోబృందావనంలో ఎన్ని వేల కోయిలలు గానం .చేసేవో ఆమెకేం తెలుసు.

కాలేజీ 'వార్షికోత్సవం' డేటు ఫిక్స్ అయిందని అనౌన్స్‌మెంట్ చెప్పగావే క్లాసులో అందరు "భార్గవి" డాన్స్ చేయాలని పట్టుబడుతూ వివాదాలు చేస్తుంటే ముగ్ధలా తనవేపు కళ్ళెత్తిచూసి "నీ అభిప్రాయం ఏంటి?" అన్నట్లు సైగ చేసినపుడు.

తను... తను... ఏం చెప్పగలిగాడు. నీపై ఆరాధనతో ఆఖరి శ్వాస వదలడం తప్ప మరేమీ నాకు చేతకాదు అన్న స్ఫురణ కలిగేలా చూడ్డం తప్ప, ఏమీ మాట్లాడలేదు

'కలలో' కన్పించి "నిన్ను నేను ప్రేమిస్తున్నానని రేపు చెప్తాను" అని ఆమె తనకు చెప్పినపుడు బ్రతుకంతా నిద్రపట్టదేమోనన్న భ్రాంతితో వలపు తీయదనాలు అనుభవించాను. వచ్చేసింది... ఆ రోజు వచ్చేసింది! తన కల నిజమైన రోజు వచ్చేసింది.

"శ్రీనివాస్... ఐ లవ్‌యు" అంటూ తన పుట్టినరోజున క్లాసంతా స్వీట్స్ పంచిపెడ్తూ తనకిచ్చిన పాలకోవామీద వ్రాసివున్న అక్షరాలతో ఇచ్చింది.

ఊపిరి బిగిసిపోయింది తనకు! దిమ్మ తిరిగిపోయింది. మర్నాడు... బస్‌స్టాప్‌లో నిల్చున్న ఆమెను కలిసి ఇద్దరూ కల్సి మొట్టమొదటిసారిగా హోటల్‌లో కాఫీ త్రాగినపుడు కాఫీలో అమృతం కంటే రుచి వుందనిపించింది.

ఆమె రేపిన స్పందనలను రోజూ డైరీలో వ్రాసుకుంటూ వుంటే ఎంత వ్రాసినా తనివి తీరదనిపించి చివరికి వేళ్ళు రక్తం కారతాయేమో అన్పించి, అది ఆమెకు చూపించి నా ప్రేమలోని స్వచ్ఛతకు ఇదే రుజువు అని చెప్పాలన్పించేది.

కానీ... కానీ... నాలో అసలైన "అంతర్మథనం" మొదలయ్యే రోజు వచ్చింది. దీన్నే "సందిగ్ధత" అంటారో లేక "విముఖత" అంటారో తెలియదు. ఆ రోజు...

"శ్రీమా! మన పెళ్ళెప్పుడు?" ఉలిక్కిపడ్డాడు తను.

పెళ్ళి... ఆ పదం అంటేనే తగని చిరాకు తనకు. తన తల్లిదండ్రులను చూసినతర్వాత, నిత్య జీవితంలో ఎంతమంది భార్యాభర్తలు నిజంగా పూర్తి సుఖంతో బ్రతుకుతున్నారు అన్న ప్రశ్న వచ్చినప్పుడు "పెళ్ళి" అంత నిర్బంధక బంధం మరోటి లేదని తెల్సినపుడు తిరిగి ఆ పదాన్ని తన జీవితంలోకి రానియ్యదల్చుకోలేదు.

ఒకవేళ తప్పనిసరి పరిస్థితిలో చేసుకుంటే తనకు ఏమాత్రం వివరాలు తెలియని అమ్మాయిని చేసుకుని మామూలుగా జీవితా

న్ని గడిపెయ్యదల్చుకున్నాడు. మోడువారిన తన జీవితంలో ఎన్నో కలశాలకొద్దీ కోర్కెల అమృతాన్ని చిలికించి ఎన్నో వసంత రాగాలు ఆలపించిన భార్గవిని... చివరికి "పెళ్ళి" రూపంలో తెచ్చేసుకుని తిరిగి అదే నిర్బంధక జీవితాన్ని తను వరించలేదు.

ఇప్పుడున్న ఈ తాజాదనం, పులకరింతలు, కలవరింతలు ఇవన్నీ "పెళ్ళి" చేసుకున్న మూడోనాడే మాయం అయిపోతాయని తనకి తెల్సు! ఒక రెండేళ్ళు తామిద్దరూ సుఖంగా గడిపినా తిరిగి ఒకరినొకరు చూసుకున్నప్పుడు ఏ స్పందనలూ, సిగ్గులూ, కవ్వింతలూ ఉండబోవని తెలుసు.

అసలు "ప్రేమ"కు పరాకాష్ఠ పెళ్ళేనా?

పెళ్ళి చేసుకోకపోతే అది ప్రేమ కాదా? మరి "ప్రేమ"కు అర్థం? అయితే ఇది ప్రేమ కాదా? కాదు... కాదు... అంతకుమిం చిన "ఆరాధన".

ఆమెనుంచి తను ఏమీ ఆశించడం లేదు ఒక్క "ఇష్టాన్ని" తప్ప. తనంటే ఆమె ఇష్టపడాలని తనకు పిచ్చి కోరిక.

ఆమె "తనువు" తనకు అవసరం లేదు. "తను" అవసరం. "తను" కావాలి.

ఆమె నాట్యం అంటే మోజు. ఆమె నవ్వు అంటే ఆరాధన. ఆమె ఆమెగా తనకు చాలాచాలా ఇష్టం. ఆమెకోసం "ప్రాణం" అయినా ఇస్తాడు తను. కానీ "పెళ్ళి" మాత్రం చేసుకోవాలని లేదు.

"పెళ్ళి" అనే సంకెళ్ళలో ఇద్దరూ ఇరుక్కుని కొద్ది రోజులకే ఎడమొఖం, పెడమొఖంగా మారిపోవడం భరించలేదు తను!

ఆత్మవంచన చేసుకోకుండా ఆలోచిస్తే పెళ్ళికాకముందు ఏ అమ్మాయి కలయికకై పరితపించిపోతారో మగాళ్ళు ఆ అమ్మాయి నే పెళ్ళిచేసుకున్న రెండేళ్ళ తర్వాత ఆమెతో శారీరక సుఖం పంచుకుంటున్నా లేక ఎంత ఒకరినొకరు అర్థం చేసుకొని బ్రతికినా ఆమె



ముఖం చూడాలంటేనే విసుగ్గా వుంటుంది.

ఆమెకూ అంతేనేమో! కాదామరి? ఒకరి ముఖం ఒకరు చూసుకున్నప్పుడు అప్పుడు ఏ స్పందనా కలగదు. ఏ నాట్యమయూరాలూ హృదయంలో పురివిప్పవు.

అఫ్‌కోర్స్! ప్రేయసి ప్రేయసే! భార్య భార్యే! ప్రేయసి కోసం తను భార్యను కష్టపెడతాడని కాదు. ఇష్టపడడనీ కాదు. కానీ... ప్రేయసి స్థానం ఒక పేద్ద అగాథం! అది ఎవ్వరూ పూడ్చలేనిది, మాపలేనిది. ఆ సింహాసనాన్ని ఎవ్వరూ అధిష్టించలేరు.

ఆ అగాధాన్నే ఒక ఆలంబనగా, ఆ అనుభవాన్నే జీవితాంతం తలుచుకుంటూ బతికేయాలి.

"ట్రింగ్... ట్రింగ్..." ఫోన్ ఖంగున మోగడంతో అతను గబుక్కున ఈ లోకంలోకి వచ్చి రిసీవర్ అందుకున్నాడు.

"హలో శ్రీనూ!" భార్గవి గొంతు.

"చెప్పు!" నెయ్యి కారుతోంది అతని పలుకులో.

"మన మేరేజ్ సంగతి అమ్మ, నాన్నతో మాట్లాడేసాను. ఏమన్నారో తెలుసా?" చెప్పలేనంత సంతోషం ఆమె ప్రశ్నలో.

ఫోన్ 'టక్'మని పెట్టేశాడు.

అతడి ముఖం మాడిపోయింది. పెళ్ళి... పెళ్ళి... పెళ్ళి... ఈ ఆడపిల్లలు "పెళ్ళి"వి తప్ప ప్రేమికుడి గురించి ఆలోచించరు. అవునుమరి! ధర్మాన్ని కాళ్ల కుక్కల్లా రక్షించే సంఘవీరులు వీళ్ళకి నేర్పించి పెట్టిన ఉగ్గుపాల పాఠం— పెళ్ళి.

"ట్రింగ్... ట్రింగ్..." మళ్ళీ ఫోన్ మోగింది. వంగి అందుకున్నాడు.

"శ్రీనూ! ఏంటి? ఒంట్లో బాలేదా?" పాలపొంగు లాంటి ప్రేమ ఆ గొంతులో.

"మనసు బాలేదు" నిరాసక్తిగా అన్నాడు

అవునూ! తన ఆలోచనే అడిగేస్తే పోలేదా! ఇంత ఆత్మక్షోభ ఎందుకు? అవును!

"భార్గవీ! మనం పెళ్ళి చేసుకుంటేనే ప్రేమించుకున్నట్లా?" నెమ్మదిగా అడిగాను, కొంచెం గుండె కొట్టుకుంటోంది స్పీదుగా.

పక్కన ఫోన్ డిస్కనెక్ట్ అయిన శబ్దం. చెవిలో ఆమెకు కలిగిన మనస్తాపంలా డయల్ టోన్!

అతను బెంబేలు పడిపోయాడు. గబగబా డ్రెస్ అయి భార్గవి ఇంటికని బయల్దేరాడు.

ఈలోగానే,

"ట్రింగ్... ట్రింగ్..." ఫోన్ అందుకున్నాడు.

"శ్రీనూ! నేను ఒక పదిరోజులు ఊర్లో ఉండను. కాబట్టి నేను రాలేను. తర్వాత వస్తాను" ఆమె పెట్టేసింది.

అంటే... అంటే... తన అభిప్రాయానికి భార్గవి సహకరించిందన్నమాట. అది... అది అసలైన స్పోర్టివ్‌నెస్. ఔనూ! ఇంతగా తనని అర్థం చేసుకొన్న భార్గవినే భార్యగా చేసుకుంటే తప్పేముంది?

తనకు, బోల్డంత ఆస్తి. ఇంట్లో సర్వస్వాతంత్ర్యం. కానీ... పెళ్ళంటేనే మొదటినుంచీ విసుగు. బహుశా దానిగురించి సరైన అవగాహన లేకేమో! 'బోర్' అనుకుంటే ఏదయినా బోరే! దేన్నయినా ఆసక్తికరంగా మలచుకొనే మెళకువ మన చేతుల్లో ఉండాలి

కానీ! అవును! భార్గవి రాగానే చెప్పేయాలి. పిచ్చిపిల్ల! ఎంత సంబరపడిపోతుందో!

ఈ ఆడపిల్లలకు ప్రేమించిన వాడినే పెళ్ళిచేసుకోవడం ఒక గొప్ప! పెద్ద మేమే సాధించామని చెప్పుకోవటానికి.

కానీ... తను పదిరోజుల వరకు రాదే. ప్చ్! ఇందాకే చెప్పేసి వుంటే ఎంత బావుండేది! ఎంత రసవత్తరంగా వుండేదో పీవ్! పది రోజులు... ఆమెను చూడకుండా ... శుభవార్తతో నిరీక్షిస్తూ.

ఒక్కొక్కరోజు గడుస్తోంది. అతను నిముషాలనే యుగాలను నిరీక్షణ అనే కాలచక్రంతో తిప్పుతున్నాడు.

"ట్రింగ్... ట్రింగ్..." అతను ఆత్రంగా అందుకున్నాడు.

"భార్గవిని! నేను ఒక అరగంటలో వస్తున్నాను. వుంటావు కదూ!"

"త...తప్పకుండా" సంతోషంగా గుటకేస్తూ అన్నాడు.

ఫైవ్ మాసుకున్నాడు. అరగంట... గడిచింది అతని ఊపిరిని చిత్రవధ చేస్తూ. బైట ఆటో ఆగిన శబ్దం.

భార్గవి నడిచివస్తోంది... దేవకన్యలా... కాదు తన భార్యలా! "శ్రీనూ! ఇదిగో ఇన్విటేషన్" నవ్వుతూ అందించింది శుభలేఖ!

"న్ని...నిజ్జంగా" అతను సంబరంగా తెరిచాడు.

పెళ్ళికొడుకు తను కాదు! అదిరిపడ్డాడు. ఓడిపోయినట్లు అయోమయంగా ఆమెవైపు చూశాడు.

"నువ్వు నీకంటే నాకే బాగా తెల్సు! కానీ నేను 'ఆడపిల్ల'ని! పెళ్ళికి తప్పకరా!" వెనక్కి తిరిగి ఆమె మౌనంగా నడిచి వెళ్ళిపోయింది.



## అనుమానం

మమతి, రాజేష్ పార్కులో కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మమతీ! మన ప్రేమ గురించి ఏదో అనుమానంగా వుంది" అన్నాడు రాజేష్.

"ఏం! మనం మధ్యలోనే విడిపోవలసి వస్తుందేమోనని?" ప్రశ్నించింది మమతి.

"కాదు. పెళ్ళి వరకూ దారి తీస్తుందేమోనని" తాపీగా చెప్పాడు రాజేష్.

—రుషిశ్రీ (కమ్మపాలెం)